
ప్రజాశక్తి
గురువారం 13 ఫిబ్రవరి 2025
5
పార్వతీపురం మన్యం



లారీ డ్రైవర్ కుమారుడికి జెఇఇ మెయిన్స్ ర్యాంకు

ప్రజాశక్తి-సాలూరు



షణ్ముఖేశ్వరరావు

పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ కొడుకు రౌతు షణ్ముఖేశ్వరరావుకు జెఇఇ మెయిన్స్ ర్యాంకు లభించింది. పట్టణంలోని డబ్బివీధికి చెందిన లారీ డ్రైవర్ రౌతు కుమార్ రాజా, వరలక్ష్మి కుమారుడైన షణ్ముఖేశ్వరరావు విశాఖపట్నంలో కెఎంఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. జెఇఇ మెయిన్స్‌లో 99.68 పర్సంటైల్‌తో షణ్ముఖేశ్వరరావు ప్రతిభ కనబరిచాడు. లారీ డ్రైవర్ కుమారుడైన షణ్ముఖేశ్వరరావు జెఇఇ మెయిన్స్ లో ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల డబ్బివీధి వాసులు వారిని అభినందించారు.

మన్యం బంద్ విజయవంతం

సిఎం హామీతో విరమణ ● గిరిజన సంఘాల విజయోత్సవ ర్యాలీలు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు



పార్వతీపురంలో విజయోత్సవ ర్యాలీ చేపడుతున్న గిరిజన, రైతు, ప్రజా సంఘాల నాయకులు, గిరిజనులు

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టంపై ఇటీవల విశాఖలో జరిగిన పర్యాటక పెట్టుబడిదారుల సదస్సులో స్పీకర్ అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలపై ఆదివాసీ అఖిల పక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యాన రెండు రోజులపాటు తలపెట్టిన మన్యం బంద్ విజయవంతమైంది. పార్టీలకతీతంగా ఆదివాసీలు సంఘాలు, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల మద్దతుతో స్వచ్ఛందంగా కలిసి ముందుకు రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. 1/70 చట్టం, గిరిజన చట్టాలు, హక్కులు జోలికి గాని రాబోమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంతో బుధవారం జరిగే బంద్‌ను విరమించారు. మరల గిరిజన చట్టాల జోలికి వస్తే ఊరుకొనేది లేదని హెచ్చరిస్తూ జిల్లాలో పలుచోట్ల విజయోత్సవ ర్యాలీలు చేపట్టారు. అందులో భాగంగా బుధవారం పార్వతీపురం పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.రామస్వామి, ఐర్ల సంఘం పి.సంఘం, రైతుకూలీ సంఘాల నాయకులు భాస్కరరావు, బొత్స నరసింగరావు, పి.రామని, పోల ఈశ్వరరావు, పి.రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి.వెంకటరమణ, సిఐటియు నాయకులు సూరిబాబు, డేవిడ్, ఎస్ఐ నాయకులు సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామనిసిఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు బంద్‌ను విరమిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రకటించారు. బుధవారం కురుపాం, జియ్యమ్మవలస మండల కేంద్రాల్లో ఆదివాసీ గిరిజన సంఘ నాయకులతో కలిసి విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వామపక్ష, గిరిజన సంఘాల నాయకులు, బంద్‌కు సహకరించిన వ్యాపారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.సీతారాం, సోమయ్య, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : 1/70 జోలికి వెళ్లబోమని స్వయంగా సిఎం చంద్రబాబు ప్రకటించడంతో మన్యం బంద్‌ను తాత్కాలికంగా విరమించినట్లు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోలక అవినాష్ తెలిపారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గిరిజనుల హక్కులు, చట్టాలు రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆదివాసీపైనా ఉందని, భవిష్యత్తులో ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మండంగి రమణ, సిపిఎం నాయకులు కె.గౌరీశ్వరరావు, ఎం.ప్రసాదరావు, పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : 1/70 చట్టం జోలికి వెళ్లబోమని సిఎం చంద్రబాబు ప్రకటించడంతో మన్యం బంద్‌ను విరమిస్తున్నట్లు సిపిఎం సీనియర్ నాయకులు రెడ్డి వేణు, ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు వెల్లడించారు. బుధవారం బంద్‌ను విరమింపజేస్తూ స్థానిక బోస్ బొమ్మ సెంటర్లో అఖిలపక్ష నాయకులతో కలిసి వారు మాట్లాడారు. ఈ నెల 24 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్‌చేశారు. జిఒ 3ను పునరుద్ధరించాలని కోరారు. బంద్‌కు సహకరించిన వ్యాపార, వాణిజ్య, ఉద్యోగ సంఘాలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి వంతల సుందర్రావు, జెఎసి నాయకులు కొండగొర్రి ఉదయకుమార్, అన్నోజిరావు, గిరిజన నాయకులు గాసి, సన్నం, అయోధ్య, జానకిరావు పాల్గొన్నారు.

సీతంపేట : మన్యం బంద్ తాత్కాలిక విరమణ చేస్తున్నట్లు ఆదివాసీ జెఎసి కన్వీనర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 1/70 చట్ట సవరణపై వెనక్కి తగ్గిన ముఖ్యమంత్రి.. జిఒ నెంబర్ 3ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, బి.అప్పారావు, జె.శ్రీరాములు, ఎం.లక్ష్మణరావు, ఎ.భాస్కరరావు, పి.సాంబయ్య, జెఎసి నాయకులు బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

కొమరాడ : సిఎం చంద్రబాబు హామీతో బుధవారం బంద్‌ను విరమించినట్లు సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. కొమరాడలో ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో బంద్ విరమించినట్లు ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు, వెంకటేష్, బోడియ, రవి, మధు, వెంకటరావు, రామస్వామి, రామారావు పాల్గొన్నారు.







కొమరాడ, సాలూరు, గుమ్మలక్ష్మీపురంలో సిపిఎం, గిరిజన, రైతు, ప్రజా సంఘాల నాయకులు, గిరిజనులు

పాఠశాలల విలీనంలో

పొరపాట్లకు తావివ్వొద్దు

విద్యాశాఖాధికారులకు స్పష్టం చేసిన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రభుత్వ పాఠశాలల విలీన ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లకూ తావివ్వరాదని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్... విద్యా శాఖాధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్లస్టర్ పాఠశాలల మ్యాపింగ్, తదితర అంశాలపై బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో విద్యా శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. పాఠశాలల విలీన ప్రక్రియ విధానంతో విద్యావ్యవస్థ మరింత బలోపేతం కానుందన్నారు. ఈ నేపథ్యంలో మండల విద్యాశాఖాధికారులు ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా నిబంధనల మేరకు క్లస్టర్ పాఠశాలల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే రూపొందించిన నివేదికను పునఃపరిశీలన చేసుకొని ముందుకువెళ్లాలని విద్యాశాఖాధికారులను కోరారు. దీంతో విద్యార్థుల్లో సామాజిక అంతరాలు తొలగాలని, విద్యా వ్యవస్థ మెరుగు పడాలని ఆకాంక్షించారు. బంగారు భవిత కార్డులో (విద్యార్థుల సమగ్ర విద్య ఆరోగ్య నివేదిక) గతేడాది అక్టోబరు నుంచి విద్యార్థుల అనీమియా, బరువు, హెచ్‌బి వివరాలను గ్రేడ్ విధానంలో విభజించి పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. తద్వారా విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను స్పష్టంగా తెలుసుకోవచ్చని వివరించారు. ముఖ్యంగా బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో ఎనీమియాను పూర్తిగా నివారించేందుకు ప్రత్యేక పోషక ఆహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్ పెంపకాలపై దృష్టిసారించాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, డిఇఒ ఎన్.తిరుపతినాయుడు, సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త తేజేశ్వరరావు, ఉప విద్యాశాఖాధికారులు డి.రాజ్ కుమార్, పి.కృష్ణమూర్తి నాయుడు, ఎంఇఒలు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం సస్పెన్షన్‌ను ఎత్తేయాలి

విద్యావ్యవస్థలో రాజకీయ వేధింపుల ఆపాలి ● డిఇఒ కార్యాలయం వద్ద ధర్నాలో సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి-పార్వతీపురం



డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

పట్టణంలోని కొత్తవలస పురపాలక ప్రాథమిక పాఠశాలలో అక్రమంగా తొలగించిన ప్రధానోపాధ్యాయునిపై సస్పెన్షన్ ఎత్తి వేయాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం ఉన్నతాధికారికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నియమించిన మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల నేటి రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని మండిపడ్డారు. ఎటువంటి కారణమూ లేకుండా కార్మికులను తొలగించాలని ప్రజాప్రతినిధులతో సహా జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా మొండిగా వ్యవహరించడం అన్యాయమన్నారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా పాతవారినే కొనసాగించాలని గత తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో నిర్ణయించుకున్నట్లు తెలిపారని గుర్తుచేశారు. అయినప్పటికీ రాజకీయ నాయకులు కలుగజేసుకొని తాము నిర్ణయించిన వారినే ఎండిఎం కార్మికులుగా నియమించాలని, వాళ్లకు మాత్రమే వంట సామగ్రి అందివ్వాలని ప్రధానోపాధ్యాయునిపై ఒత్తిడికి గురి చేయడం సరైనదికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమానికి అడ్డుకట్ట వేయాలని సిఐటియు ఆధ్వర్యాన జనవరి 29న విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీతో పాఠశాల ప్రారంభ సమయానికి ముందు ధర్నా చేస్తుండగా, ప్రధానోపాధ్యాయులు ఘటనా స్థలానికి వచ్చారని గుర్తుచేశారు. ఎంఇఒతో సంప్రదించామని, పాతవారినే కొనసాగిస్తున్నామని హెచ్ఎం మీడియాతో మాట్లాడటంతో రాజకీయ నాయకులు అహంకారంతో సస్పెండ్ చేయడం సరికాదన్నారు. మంచి పాలన అందించాలని ప్రజలు అధికారాన్ని అప్పగిస్తే, ఇటువంటి నీచపు పనులకు ఒడిగట్టడం దుర్మార్గమైన చర్యని దుయ్యబట్టారు. పోరాటం చేసిన సిఐటియు, సిపిఎం నాయకులను ఎదురించలేక.. కార్మికులను, ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడం సిగ్గుచేటన్నారు. ఇకనైనా ఇటువంటి వైఖరిని విడనాడి, అక్రమంగా తొలగించిన ప్రధానోపాధ్యాయులను యథావిధిగా అదే పాఠశాలలో నియమించాలని, సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో రాజకీయ జోక్యాలు మానుకోవాలని, లేకుంటే భవిష్యత్తులో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు బి.సూరిబాబు, గిరిజన సంఘం నాయకులు పాలమిట్ట రాము, తదితరులు పాల్గొన్నారు.

పాఠకుల మనసుల్లో

పివిబిది చెరగని ముద్ర

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మధ్య తరగతి కుటుంబాల జీవితాలను కథలుగా మలచడం ద్వారా పి.వి.బి.శ్రీరామ్మూర్తి పాఠకుల మనసులలో చెరగని ముద్ర వేశారని ప్రముఖ సాహితీవేత్త గంటేడ గౌరునాయుడు అన్నారు. ఇటీవల విజయనగరంలో మరణించిన పార్వతీపురం పట్టణానికి చెందిన ప్రముఖ కథా రచయిత పి.వి.బి.శ్రీరామ్మూర్తి సంస్మరణ సభను బుధవారం స్థానిక వేదాంత కళాశాలలో డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత బెలగాం భీమేశ్వరరావు మాట్లాడుతూ కథా రచయితగా, ఉపాధ్యాయునిగా శ్రీరామ్మూర్తి పార్వతీపురం ప్రాంతానికి చేసిన సేవలు మరువరానివని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ శ్రీరామమూర్తి ఉత్తమ వ్యక్తిత్వం కలిగి ఉంటూ శిష్యులెందరినో ఉన్నత స్థాయికి చేర్చిన మంచి ఉపాధ్యాయులని కొనియాడారు. కార్యక్రమంలో సినీ గీత రచయిత తుంబలి శివాజీ, యుటిఎఫ్. రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, సిరికి స్వామినాయుడు, చింత అప్పలనాయుడు, పాలకొల్లు రామలింగస్వామి, మల్లిపురం జగదీశ్, పక్కి రవీంద్రనాథ్, తేజోమూర్తుల ప్రకాశరావు, బి.వి.పట్నాయక్, జి.రాజు పాల్గొన్నారు.

అయ్యన్న క్షమాపణ చెప్పాల్సిందే

● మంత్రి సంధ్యారాణి వ్యాఖ్యలు అవగాహనా రాహిత్యం

● మాజీ డిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి ధ్వజం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం



టిడిపి నాయకులు ఇచ్చిన ప్రకటనలను చూపిస్తున్న పుష్ప శ్రీవాణి

1/70 చట్టంపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు గిరిజనుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి ఆక్షేపించారు. స్పీకర్ వ్యాఖ్యలు పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకమని, వెంటనే ఆయన గిరిజనులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం జియ్యమ్మవలస మండలంలో చినమేరంగి కోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 1/70 చట్టం గిరిజనులకు రక్షణ కవచమన్నారు. గిరిజనుల భూములపై గిరిజనేతరులు పెత్తనం లేకుండా ఉండేందుకే ఈ చట్టాన్ని తీసుకువచ్చారని చెప్పారు. 1/70 చట్టంలో మార్పు అంటే.. గిరిజనులను అడవికి దూరం చేయడమేనని ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి చట్టంపై అనుచిత వ్యాఖ్యలు చేసింది స్పీకర్ అయితే.., ఆయన తప్ప కూటమి నేతలంతా మాట్లాడారని, కానీ ఏఒక్కరైనా అయ్యన్న వ్యాఖ్యలను ఖండించారా? అని ప్రశ్నించారు. 2002లో జిఒ నంబర్ 3 రద్దయినట్టు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇచ్చిన ప్రకటన ఆమె అవగాహనా రాహిత్యమని ఎద్దేవా చేశారు. జిఒ నంబర్ 3 కోసం కూటమి ప్రభుత్వం మాట్లాడింది పచ్చి అబద్ధమన్నారు. కూటమి ప్రభుత్వానికి గిరిజనులపై చిత్తశుద్ధి లేదని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, గిరిజన మంత్రి ఇచ్చిన మొదట వాగ్దానానికే దిక్కులేదని విరుచుకుపడ్డారు. బంద్ ఆపగలిగారు కానీ స్పీకర్ గిరిజనులకు క్షమాపణ చెప్పకపోతే వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. సమావేశంలో గుమ్మలక్ష్మీపురం ఎంపిపి కె.దీనమయ్య, ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి, కురుపాం వైస్ ఎంపిపి అన్నోజిరావు, వైసిపి నాయకులు సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పనస ధర పతనం

● రోజురోజుకూ తగ్గుతున్న ధర

● డిమాండ్ లేకపోవడమే కారణం!

● జిసిసి ద్వారా కొనాలని కోరుతున్న గిరిజనం



సంతలో కాటాలు పెట్టి కొనుగోలు చేస్తున్న దళారులు

ఏజెన్సీలో గిరిజనులకు ఆర్థికంగా చేయూతనిచ్చేది పనస. అలాంటి పనస ధర రోజురోజుకీ పతనమవుతోంది. తగ్గిన పనస ధర సీతంపేట ఏజెన్సీలో గిరిజన రైతుల్ని కలవరపెడుతోంది. వర్షాల్లేక తగ్గిన పనసకాయల దిగుబడి.. ఓవైపు గిరిజనులను కుంగదీసింది. అరకొర పంట అయినా సరిగ్గా చేతికొచ్చే సమయంలో డిమాండ్ లేదనే సాకుతో పనసకాయల ధరను సంతల్లో దళారులు సగానికి తగ్గించారు. తప్పనిసరి పరిస్థితుల్లో గిరిజనులు విక్రయించి నష్టపోవాల్సి వస్తోంది.


ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో సుమారు వెయ్యి ఎకరాల వరకు పనస సాగులో ఉంది. డిసెంబర్ నుంచి మార్చి నెల వరకు పనసకాయ కాపు వస్తుంది. దీనిలో రెండు రకాలు.. బురద పనస, ఖర్జ పనస ఉన్నాయి. బురద పనస పండు తయారైన తర్వాత కోసుకొని తింటారు. అదే ఖర్జ పనస అయితే, పండు తర్వాతనే తినవచ్చు. కూర, బిర్యానీ వంటకాల్లో వేసుకుని ఆరగించవచ్చు. ఏజెన్సీలో ఎక్కువగా ఖర్జ పనస సాగవుతోంది. ఏజెన్సీ పనసకు పోషకాలు అధికంగా ఉండటంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఏజెన్సీలో పనస ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి సహజ సిద్ధంగా తయారవుతుంది. దీంతో పట్టణ ప్రాంతాల్లో దీనిని కొనుగోలు చేయడానికి ఎగబడుతుంటారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పనస దిగుబడి తగ్గిపోయింది. దాంతోపాటు ధర కూడా రాక పోవడంతో గిరిజనులు గగ్గోలు పెడుతున్నారు.

తగ్గిన ధర

సీతంపేట ఏజెన్సీ నుంచి ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్, బరంపూర్‌తోపాటు విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, బెంగళూరుకు ఇక్కడ పనసను దళారులు రవాణా చేస్తున్నారు. ఒడిశాలో పనసకాయ అంటే చెవి కోసుకుంటారు. ఎందుకంటే ప్రతి శుభకార్యంలో, పెళ్లిళ్లలో పనసకాయ కూర, పనస బిర్యానీ తప్పనిసరిగా చేస్తారు. సీతంపేట ఏజెన్సీలో పండిన పనసకాయలను సీతంపేట, కుసిమి, మర్రిపాడు సంతకాలకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గతంలో సంతల్లో దళారులు కాయసైజును బట్టి రూ.40 నుంచి 80 వరకు కొనుగోలు చేసేవారు. కిలో రూ.30పైనే పలికేది. కానీ ఇటీవల కాలంలో పనసకాయ ధర రూ.20లోపే కిలో కొనుగోలు చేస్తున్నారు. కాయ ధర సైతం పడిపోయింది. ఇతర రాష్ట్రాలైన కేరళలో అధికంగా పనస పంట కాపు ఉంది. అంతేగాక కూరగాయలు ఒడిశాలో అధికంగా పండిస్తున్నారు. దీంతో ఏజెన్సీలో ఉన్న పనసకాయ ధర ఒక్కసారిగా పడిపోయిందని చెబుతున్నారు. ఇంకా పనస ధర తగ్గే అవకాశం ఉందని చెబుతూ మరింత తక్కువకు దళారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనసకు జిసిసి ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

దిగుబడి తగ్గింది



గత ఏడాది మీద పోలిస్తే ఈ ఏడాది పనస దిగుబడి తగ్గింది. వర్షాలు సకాలంలో కురవక పోవడంతో పంట దిగుబడి కూడా తగ్గిపోయింది. పనసకాయలు తక్కువగా మార్కెట్‌కు రావడంతో డిమాండ్ పెరగాలి. కానీ, తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

– సవర కువ్వారి, ముత్యాలు సెంటర్

మార్కెట్ ధర తగ్గించారు



గతంలో పనసకాయ సైజును బట్టి రూ.40 నుంచి రూ.80 వరకు దళారులు కొనేవారు. కిలో రూ.30 వరకు తీసుకునేవారు. ప్రస్తుతం కిలో రూ.20 మించి కొనుగోలు చేయడం లేదు. దీనివల్ల చాలా నష్టపోతున్నాం.

– సవర సింహాచలం, ముత్యాలుకాలనీ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను విని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అవసరం ఉన్నా నిత్యం తాను అందుబాటులో ఉంటానని చెప్పారు. సమస్య ఏదైనా సరే ధైర్యంగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

'తప్పుడు రాతలు రాస్తే సహించేది లేదు'

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఇటీవల కొంతమంది టిడిపిపైనా, ఎమ్మెల్యేపైనా తప్పుడు కథనాలు రాస్తున్నారని, అటువంటి రాతలు రాస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, పెంకి వేణుగోపాల్ నాయుడు, బార్నాల సీతారాం, రౌతు వేణుగోపాల్ నాయుడు, గుండ్రెడ్డి రవికుమార్ మాట్లాడారు. ఎమ్మెల్యే విజయ్‌చంద్ర చొరవతో నియోజకవర్గంలో గ్రామాల్లో సిసి, బిటి రోడ్లు, సీతానగరం నూతన బ్రిడ్జి పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు పేదలకు అందే విధంగా ఎమ్మెల్యే శ్రమిస్తున్నారని, ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఆయన చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తూ రాతలు రాయిస్తున్నారని, ఇది ఎంత మాత్రమూ మంచి పద్ధతి కాదని హితవుపలికారు. ఈ సమావేశంలో నాయకులు బోను చంటి, కోరాడ నారాయణరావు, బడే గౌరునాయుడు, కోలా మధు, వెంకటేష్, భాను ప్రసాద్, భాస్కరరావు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని పైడిమారమ్మ ఆలయ నిర్మాణానికి ప్రముఖ కార్డియాలజిస్ట్ ఐవివి ప్రసాద్ లాల్, లక్ష్మీ లాల్ దంపతులు రూ.3.50 లక్షలు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పల్ల సింహాచలం నాయుడు రూ.లక్ష విరాళాలు అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు శ్రీనివాస్, రంజిత్ కుమార్, బాలకృష్ణ, వంశీ, పోలినాయుడు, బుజ్జి, సాయి ఉమా, రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూడో వారం ఆదాయం రూ 8.79 లక్షలు

ప్రజాశక్తి-మక్కువ

మూడో వారం శంబర పోలమాంబ అమ్మవారి దర్శనానికి వచ్చిన యాత్రికుల ద్వారా రూ.8,79,807 ఆదాయం సమకూరినట్లు ఇఒ వివి సూర్యనారాయణ వెల్లడించారు కేశఖండన దర్శనాలు, ప్రసాదాల టికెట్లు, మహా అన్నదాన కార్యక్రమం విరాళం అన్ని కలిపి ఈ ఆదాయం లభించినట్లు తెలిపారు. గత ఏడాది మూడో మంగళవారంతో పోలిస్తే రూ.1,06,148 ఆదాయం తగ్గిందని వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో సంఘాల సమాచారం

ప్రజాశక్తి-సీతానగరం

మహిళా సంఘాల సభ్యుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎం.సత్యవాణి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సభ్యుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఎల్ పోర్టల్‌లో ప్రతి సభ్యుని డేటా పొందుపరచాలన్నారు. బ్యాంకుల లావాదేవీలు ఆన్‌లైన్లోనే పొందుపరచాలని చెప్పారు. కార్యక్రమంలో ఎపిఎం ఆర్.శ్రీరాములనాయుడు, కె.కుసుమకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 18న నీలావడి అగ్ని గంగమ్మ పండగ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలకు ఇలవేల్పు అయిన నీలావడి అగ్ని గంగమ్మ పండగ మార్చి నెల 16,17,18 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పూజా కమిటీ అధ్యక్షులు బడే సత్యనారాయణ తెలిపారు. బుధవారం బందుగాం తహశీల్దార్ సోనాలి పాత్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మార్చి 10న అమ్మవారి ఘటాలను మండపానికి తీసుకువచ్చి ప్రతిష్ఠించడంతో పండగ ప్రారంభమై, 19న అనుపు ఉత్సవంతో ముగుస్తుందని తెలిపారు. వందలాదిగా తరలివచ్చే భక్తుల కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు అన్ని ప్రభుత్వ శాఖలు సహకరిస్తాయని తెలిపారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఎత్తు, బరువులు ఏ విధంగా తీయాలి, పిల్లల ఎదుగుదలపై పర్యవేక్షణ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు సిడిపిఒ అనంతలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టి.కనకదుర్గ, జిల్లా ప్రోగ్రాం అధికారి ఎం.విజయ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కస్పా వీధిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో ఉన్న కస్పా వీధిలో బుధవారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, మధుమేహ, రక్తపోటు, జ్వర పీడితులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరు వృథా

ప్రజాశక్తి - సంతకవిటి

మడ్డువలస రిజర్వాయర్ నుండి విడుదల చేసిన సాగునీరు మండలంలోని గరికపాడు వద్ద వృథాగా పోతుంది. బుధవారం రిజర్వాయర్ పిల్ల కాలువ గండి కొట్టడంతో సంతకవిటి నుంచి రాజాంకు వెళ్లే ప్రధాన రహదారి మీదుగా సాగునీరు ఏరులై పారింది. మడ్డువలస రిజర్వాయర్ అధికారులు పిల్లకాలువ పై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యం వహించడం వల్లే ఎప్పటికప్పుడు కాలువ గండి కొట్టి సాగునీరు వృథా అవుతుందని రైతులు వాపోతున్నారు. దీంతో మండలంలోని శివారు గ్రామాలకు సాగునీరు అందకుండా పోతుందని చెబుతున్నారు. ఇప్పటికే సాగునీరు అందక మొక్కజొన్న, చెరుకు పంటల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ గండి పడటంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు నానా అవస్థలు పడ్డారు. తక్షణమే మడ్డువలస రిజర్వాయర్ అధికారులు స్పందించి సాగునీరు పోకుండా అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

నల్లబెల్లి పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని నల్లబెల్లి ఎంపి యుపి పాఠశాలను ఎంఇఒ ఎన్‌జి నాగభూషణం బుధవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణ, కిచెన్ గార్డెన్, తరగతి గదులు, ఉపాధ్యాయుల డైరీలు, విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించారు. గుడివాడ ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ -2 పి.బాలభాస్కర్ రావు బుధవారం సందర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

చెరువుల పునరుద్ధరణకు చర్యలు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో చెరువుల పునరుద్ధరణకు జలవనరుల శాఖ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లాలో జలవనరుల శాఖ, జీవనోపాధులపై అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జలవనరుల లభ్యత అధికంగా ఉన్నాయన్నారు. వాటిని సరైన రీతిలో పరిరక్షించుకోవడం వల్ల జలవనరులు పెరిగి, అత్యంత ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. దాదాపు 187 చెరువులు వంద ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగి ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుటకు అవకాశం ఉందని తెలిపారు. ప్రతి చెరువును జిపిఎస్ వ్యవస్థను ఉపయోగించి మ్యాపింగ్ చేయాలని ఆయన ఆదేశించారు. జిల్లాలో ఉన్న 2915 చెరువులను పక్కాగా పరిరక్షించుకోవాలని, ఆక్రమణలు జరగకుండా చుట్టూ ట్రెంచ్‌లు కొట్టాలని సూచించారు. ఖరీఫ్‌లో 2.78 లక్షల ఎకరాల్లో, రబీలో 36 వేల ఎకరాల్లో పంటలు వేస్తున్నారని, దానిని రెట్టింపు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఆస్తుల రక్షణకు వివిధ ప్రాజెక్టులతో ముందుకు రావాలని ఆయన ఆదేశించారు.

కుటుంబాల ఆదాయం పెరగాలి

జిల్లాలో కుటుంబాల ఆదాయం పెరగాలలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. వన్‌ధన్ వికాస్ కేంద్రాలు, నైపుణ్య అభివృద్ధి శిక్షణ, ఇతర శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు బలోపేతం చేయాలన్నారు. మండలాల వారీగా జాబ్ మేళాలు నిర్వహించాలని చెప్పారు. విశ్వకర్మ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. విడివికె లు క్లస్టర్ వారీగా ఏర్పడి సంబంధిత ఉత్పత్తులు పెంచాలన్నారు.

ఈ సమావేశంలో పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జలవనరులు శాఖ పర్యవేక్షక ఇంజనీర్ సుధాకరరావు, కార్యనిర్వహణ ఇంజనీర్ ఆర్.అప్పలనాయుడు, ఐటిడిఎ ఎపిఒలు జి.చినబాబు, ఎ.మురళీధర్, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు, సీతంపేట గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి అన్నదొర, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎన్.విజయ స్వరూప్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో కొత్తవలసలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నేషనల్ అకాడమిక్ ఎక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి) సభ్యులు బుధవారం సందర్శించారు. నాక్ కమిటీ చైర్మన్ ఎస్.సత్యనారాయణ, సభ్యులు చంద్రకాంత్, సుభాష్‌కు కళాశాల ప్రిన్సిపల్ చలపతి రావుతోపాటు, అధ్యాపకులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఎన్‌సిసి క్యాడెట్లు గౌరవ వందనాన్ని సమర్పించారు. కళాశాల ఏర్పాటు నుంచి విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను చైర్మన్, సభ్యులకు ప్రిన్సిపల్ వివరించారు. అనంతరం కళాశాల సీనియర్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా నాక్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిగ్రీ కళాశాలల అభివృద్ధిపై దృష్టి పెట్టాయని, ఇందులో భాగంగా రెండు రోజులపాటు ఎస్‌విడి ప్రభుత్వ కళాశాలను సందర్శిస్తున్నామని చెప్పారు. ఇంకా కళాశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధ్యయనం చేస్తామన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

డిఎంహెచ్ఒ భాస్కరరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గర్భిణుల ఆరోగ్యమే ధ్యేయంగా అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు.. వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తాడికొండ పిహెచ్‌సిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో వైద్య సేవల తీరు పరిశీలించారు. పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో గర్భిణులకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, పరీక్షల వివరాలు, హిమోగ్లోబిన్ శాతం నివేదికలు పరిశీలించారు. గర్భిణులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రక్తహీనతగా గుర్తించిన 10 మంది గర్భిణులను డిఎంహెచ్ఒ దత్తత తీసుకొని వారికి పోషకాహార కిట్లు అందజేశారు. ప్రతీ రెండు వారాలకు వారి హిమోగ్లోబిన్ శాతం, ఆరోగ్య వివరాలు స్వయంగా పరిశీలించి, పర్యవేక్షణ చేస్తానని వెల్లడించారు. రక్తహీనత ఉన్న గర్భిణులను వైద్యాధికారులు దత్తత తీసుకొని స్వయంగా ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని కోరారు. అనంతరం ఫీడర్ అంబులెన్సులను పరిశీలించి, డ్రైవర్లకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు బుద్దేశ్వరరావు, అభిలాష్, డిఎస్ఒ శంకర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

తోలుఖర్జ పాఠశాల సందర్శన

మండలంలోని తోలుఖర్జ ప్రాథమిక పాఠశాలను డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు పరిశీలించారు. విద్యార్థుల్లో రక్తహీనత రాకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని శారద, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయగౌరి మద్దతుగా విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-పాచిపెంట

పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరికి మద్దతుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు.. బుధవారం పాచిపెంట మండలంలో ప్రచారం చేశారు. పాంచాలి, సరాయివలస, కొత్తవలస, పద్మాపురం, పాచిపెంటతోపాటు సాలూరు మండలంలోని పిఎన్ బొడ్డవలస పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి, విజయగౌరికి మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకోవడానికి ప్రశ్నించి, పోరాడే వ్యక్తులను శాసనమండలిలోకి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జి.వెంకట నాయుడు, ఎ.గణపతి, సురేష్, సత్యనారాయణ, హరికృష్ణ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహనరావు

సరిహద్దు చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి అంకిత

ప్రజాశక్తి-పాచిపెంట

ఒడిశా-ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎఎస్‌పి అంకిత సురాన తెలిపారు. బుధవారం పాచిపెంట పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణా పూర్తి నియంత్రణకు ప్రత్యేక చర్యల్లో భాగంగా ప్రస్తుతం పి.కోనవలసలో ఉన్న చెక్ పోస్ట్‌తోపాటు మాతుమూరు జంక్షన్ వద్ద మరో చెక్‌పోస్ట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మహాశివరాత్రి సందర్భంగా పారమ్మ కొండ వద్ద జరిగే జాతరకు 120 మంది పోలీస్ బందోబస్తును నియమిస్తున్నామన్నారు. ప్రజలతో పోలీసులు మమేకం అయ్యేందుకు వైద్య శిబిరాలు, వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలూరు టౌన్, రూరల్ సిఐలు రామకృష్ణ. అప్పలనాయుడు, ఎస్ఐ వెంకట సురేష్ పాల్గొన్నారు.

కలిసి పనిచేద్దాం

కమిషనర్ వెంకటేశ్వర్లు



కమిషనర్ వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణాభివృద్ధి కోసం అందరం కలిసి బాధ్యతతో పనిచేద్దామని మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పార్వతీపురం మున్సిపల్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ చాంబర్లో ఎఫ్ఎసి కమిషనర్ జి.శ్రీనివాసరాజు నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ తోటి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం, పాలకవర్గం సహకారంతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి.లక్ష్మి, టిపిఒ ప్రమీలా రాణి, ఆర్ఒ రూబెన్ దిబ్బ, ఎఇలు అప్పారావు, సన్యాసిరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీర్‌రాజు, ఆర్ఐలు ఈశ్వరరావు, వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కార్మికుల శ్రేయస్సే లక్ష్యం



జట్టు ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎపిఇఇఎ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

విద్యుత్తు కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) పనిచేస్తుందని ఆ యూనియన్ మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, రెడ్డి శ్రీధర్ తెలిపారు. బుధవారం పార్వతీపురంలో ఆ యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులో ఉన్న జట్టు ఆశ్రమంలో నిత్యావసర సరుకులను, పండ్లను పంపిణీ చేశారు. అనంతరం బెలగాంలోని నిరాశ్రయుల వసతిగృహంలో అన్నదానం, పండ్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ కార్యవర్గ సభ్యులు సిహెచ్ సత్యనారాయణ, పివి నారాయణరావు, ఎస్.ప్రవీణ్ కుమార్, పి.రాములు, తదితరులు పాల్గొన్నారు.

భూఆధార్‌తో ఎన్నో ప్రయోజనాలు



భూఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రజాశక్తి-పాచిపెంట

రైతులు భూఆధార్ (విశిష్ట సంఖ్య)తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. బుధవారం మండలంలోని కర్రివలస, విశ్వనాథపురం రైతు సేవా కేంద్రాల్లో రైతుల విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవా, ఎరువులు, విత్తనాలు, పంటల బీమా, పంట రుణాలు, సున్నా వడ్డీ పథకాలు వంటివి పొందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుని విశిష్ట సంఖ్యను పొందాలని కోరారు. అందుకోసం ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానించి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్ కృష్ణ, మోహన్ కుమార్ పాల్గొన్నారు.

సీతానగరం : రైతులు రైతు పోర్టులో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎఒ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, గుచ్చిమి రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వన్ బి, ఆధార్ కార్డు, ఫోన్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసు ఛేదించిన పోలీసులు

విజయనగరంకోట: బొబ్బిలి పట్టణం చిన బజారులో ఫిబ్రవరి 1న రాత్రి జరిగిన చోరీ కేసును ఛేదించి, చోరీకి సహకరించిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, 45 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. బుధ వారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. బొబ్బిలికి చెందిన జ్యూవలరీ షాపు యజమాని గ్రంధి రవికుమార్ తన ఇంటి తాళం గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి, ఇంటిలోకి ప్రవేశించి, 45 తులాల బంగారు ఆభరణాలను అపహరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుల గురించి గాలించి బొబ్బిలి మండలం గున్నతోటవలసకు చెందిన పెంకి శ్రీనివాసరావు, బొబ్బిలికి చెందిన బత్తుల సర్వేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ముద్దాడకు చెందిన నరసింగరావును అదుపులోకి తీసుకుని విచారించారు. పాత నేరస్థుడు సీతానగరం మండలం, జోగింపేట గ్రామానికి చెందిన పోలా భాస్కరరావుతో కలసి చోరీకి పాల్పడినట్లు అంగీకరించారన్నారు. దొంగిలించిన వస్తువులను అమ్మేందుకు రాయగడ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారని ఎస్‌పి తెలిపారు. పరారీలో ఉన్న పోలా భాస్కరరావు కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

పేట్రేగిపోతున్న పెట్రోల్ దొంగలు

బొబ్బిలి: పట్టణంలో పెట్రోల్ దొంగలు పెట్రేగి పోతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలలో పెట్రోల్‌ను దొంగిలిస్తున్నారు. షిరిడి సాయిబాబు ఆలయం ఎదురుగా ఉన్న ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న ద్విచక్ర వాహనాలలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ తీసేసారు. పెట్రోల్ దొంగిలిస్తున్న వీడియో సీసీ కెమెరాలలో రికార్డు అయింది. నాయుడుకాలనీ, మెహర్ కాలనీ, వెలమవారివీధి, సాయి నగర్, స్వామివారి వీధి తదితర ప్రాంతాల్లో పెట్రోల్ దొంగిలిస్తున్నారు. పెట్రోల్ దొంగలపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని పోలీసులను ప్రజలు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని కూరాకులవీధికి చెందిన చోడవరపు లక్ష్మణరావు (33) అనే వ్యక్తి గడ్డి మందు తాగి మృతి చెందాడు. ఎస్ఐ జి.కళాధర్ కథనం ప్రకారం.. లక్ష్మణరావు గత కొద్ది రోజులుగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. మంగళవారం గ్రామానికి సమీపంలో పాఠశాల పక్కన మామిడి తోట వద్ద గడ్డి మందు తాగి లక్ష్మణరావు పడి ఉండటాన్ని గమనించిన కర్రి శ్రీను అనే వ్యక్తి.. ఆయన భార్య దేవికి సమాచారం ఇచ్చాడు. భార్యతోపాటు కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని, చికిత్స కోసం వీరఘట్టం పిహెచ్‌సికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఆయన మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. భార్య దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట జాతీయ రహదారి పక్కన బుదవారం తెల్లవారు జామున టారాస్ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా పెద్ద ప్రమాదం తప్పింది. క్లీనర్ తెలిపిన వివరాల మేరకు విశాఖ పోర్ట్ నుంచి ఒడిశా వెళ్తున్న లారీ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. అర్ధరాత్రి పెద్ద శబ్దం రావడంతో స్థానికులు చేరుకుని 108కి సమాచారం ఇచ్చారు. అంబులెన్స్‌లో డ్రైవర్‌ను బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

రాజాం: నూతన ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలోని దుకాణాలు వెనుక ఉన్న డ్రైన్‌లో మండలంలోని రాయవలస గ్రామానికి చెందిన మజ్జి రమణ (34) పడి బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సిఐ అశోక్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెంది ఉంటాడని అంచనా వేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ అనిల్

ప్రజాశక్తి -భామిని

క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసం కలిగిస్తాయని బత్తిలి ఎస్ఐ డి.అనిల్ కుమార్ అన్నారు. బత్తిలి వాలీబాల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఒకప్పుడు గ్రామాలలో యువతకు సరదానిచ్చే అంశమంటే క్రీడాలేనని, ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు. యువత క్రీడల వైపు దృష్టిసారించాలని బత్తిలి ఎంపిటిసి టింగ అన్నాజిరావు అన్నారు. కార్యక్రమంలో సుధా, ఎస్.గాలిబ్, ఆర్.చిన్ని, ఆర్.సంతోష్, ఎన్.చిన్న, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని నెమలాం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కోనారి ప్రసాద్ హత్య ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. సిఐ నారాయణరావు ఆధ్వర్యాన ప్రత్యేక పోలీసు బృందాలు పలు కోణాల్లో సమాచార సేకరణ చేస్తున్నారు. అయినప్పటికీ ఏ విధమైన సమాచారమూ ఇప్పటివరకు రాలేదని సిఐ తెలిపారు. నెమలాం-బూరి పేట గ్రామాలకు సంబంధించి అనుమానితులను పిలిపించి విచారణ చేస్తున్నట్లు చెప్పారు. హత్యకు గురైన ప్రసాద్ కుటుంబంతో ఎవరికైనా తగాదాలు ఉన్నాయా, ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రసాద్‌కు ఇంకా పెళ్లికాకపోవడంతో ఎవరితోనైనా ప్రేమ వ్యవహారాలు, అక్రమ సంబంధాలు ఉన్నాయా అనే కోణాన్ని కూడా పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సిఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి బేబినాయన పరామర్శ

కోనారి ప్రసాద్ కుటుంబాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన బుధవారం పరామర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి భయంకరమైన సంఘటనలు జరగడం చాలా దురదృష్టకరమని అన్నారు. నిందితులు ఎంతటి వారైనాప్పటికీ తక్షణమే కేసును ఛేదించి బాధిత కుటుంబానికి తగు న్యాయం జరిగించేలా చూడాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు మండల పార్టీ అధ్యక్షులు ఎన్.వెంకట్ నాయుడు, ఎన్.వెంకటేశ్వరరావు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు